క్లుప్తంగా

భగవద్గీత పఠనంతో ప్రశాంతత

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ అన్నారు. సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచారధామంలో స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏకాదశి పురస్కరించుకొని 'సంపూర్ణ భగవద్గీత' పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏకాదశి రోజున వందలాంది మందితో సంపూర్ణ భగవద్గీత పారాయణం జరుగుతుందన్నారు. సంఘం సభ్యులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ తగ్గించాలి



మాట్లాడుతున్న పిల్లలమర్రి నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మార్చి 17వ తేదీన ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలులోని సీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోవాలన్నారు. చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. నాయకులు కన్నయ్య, లక్ష్మన్న, తుల భారతి, వెంకటరమణ, గోవిందు, బాలాజీ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



న్యాయవాది నాగలక్ష్మీ దేవిని సన్మానిస్తున్న వీసీ బసవరావు, తదితరులు

కర్నూలు కల్చరల్: కుటుంబాభివృద్ధితో పాటు దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వి.బసవరావు అన్నారు. సోమవారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆర్‌యూసీఈ సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా మహిళలు సాధించిన విజయాలను గుర్తు చేశారు. న్యాయవాది నాగలక్ష్మీదేవి మాట్లాడుతూ.. మనోధైర్యంలో స్త్రీ పురుషుడికన్నా ఎన్నో రెట్లు శక్తిమంతురాలన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ పి.శ్రీవిద్య మాట్లాడుతూ.. మనో నిబ్బరంతో ఎలాంటి కష్టాన్నైనా తట్టుకొనే శక్తి మహిళలకే సొంతమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, ఉమెన్ వింగ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

14న గౌర పూర్ణిమ

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో కర్నూలు భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఈనెల 14వ తేదీన గౌర పూర్ణిమ వేడుకలు, శ్రీ చైతన్య మహా ప్రభు ఆవిర్భావ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు పేర్కొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహా శంఖాభిషేకం, గౌర లీలపై ప్రత్యేక ప్రవచనం, మహారాజ భోగ నివేదన, తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జెడ్పీటీసీ మృతి బాధాకరం

కర్నూలు (అర్బన్): ఉమ్మడి జిల్లాలోని ప్యాపిలి మండల జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి మృతి చెందడం బాధాకరమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాదు అపో లో ఆసుపత్రిలో సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు సమాచారం అందిందని ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీన స్థానిక ఓమ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను పరామర్శించినట్లు పేర్కొన్నారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తీసుకెళ్లడంతో అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు వెల్లడించారు. జెడ్పీటీసీగా ఆయన ఎంతో హుందాగా వ్యవహరించేవారని, తనదైన శైలిలో ఎవరినీ నొప్పించకుండా సమస్యలను ప్రస్తావించడం శ్రీరామిరెడ్డి ప్రత్యేకత అని కొనియాడారు. ఆయన అకాల మరణానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

హుండీ పగులగొట్టి చోరీ

పాణ్యం: మండల పరిధిలోని వడ్డుగండ్ల ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి నగదు చోరీ చేశారు. ఘటనపై సోమవారం గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయంలో దాదాపు ఐదు సంవత్సరాల నుంచి హుండీ లెక్కించలేదని రూ.50 వేల వరకు నగదు ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

చల్లని హాని



కూల్‌డ్రింక్స్ శ్యాంపిల్ సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి



- వేసవిలో కల్తీ కూల్‌డ్రింక్స్‌తో ఆరోగ్యానికి ముప్పు
- రంగు, రుచి కోసం చూస్తే సమస్యలే
- సహజ పానీయాలతో ఆరోగ్యం
- మండు వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): మార్చి నెల మొదలైందో లేదో...వేసవి భగభగలు ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలు దాటిన తర్వాత బయటకు వెళ్లాలంటే జనం హడలిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లినవారు దాహార్తితో గొంతు తడుపుకోవడానికి కూల్‌డ్రింక్‌ల వైపు చూస్తున్నారు. మొన్నటివరకు చల్లటి గాలి వీస్తేనే వణికేవారు.. ఇప్పుడు అదే చల్లదనం కోసం ఆరాట పడుతున్నారు. కూల్‌డ్రింక్‌లతో గొంతును చల్లబరచుకోవడానికి ఉవ్విల్లూరుతున్నారు. అయితే అన్ని కూల్‌డ్రింక్‌లు మంచివి కావని, సహజసిద్ధమైన పానీయాలే ఆరోగ్యానికి మేలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గత వారం రోజులుగా 38 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ప్రజలు దాహం తీర్చుకునేందుకు తహతహలాడుతున్నారు. మొన్నటి వరకు గొంతు తడుపుకోవడానికి సైతం ఆసక్తి చూపని వారు ఇప్పుడు లీటర్లకొద్దీ నీటిని తాగేస్తున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో చల్లదనం కోసం కొందరు కూల్‌డ్రింక్స్ వైపు మొగ్గుచూపుతున్నారు. గత మూడు నెలలుగా ఓ మోస్తరుగా ఉన్న కూల్‌డ్రింక్స్ దుకాణాల్లో వ్యాపారం మళ్లీ ఊపందుకుంది. దీంతో ఎక్కడ చూసినా కూల్‌డ్రింక్స్ దుకాణాలు కళకళలాడుతున్నాయి. రుచితో పాటు ఆరోగ్యమూ ప్రధానమని, సాంప్రదాయ ద్రవాలే మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల వరకు రూ.10కి ఐదు నిమ్మకాయలు ఇచ్చేవారు. ఇప్పుడు కేవలం రెండు మాత్రమే వస్తున్నాయి.


కూల్‌డ్రింక్స్‌తో ఆరోగ్య సమస్యలు

ప్రస్తుతం అన్ని దుకాణాల్లో శీతల పానీయాలు లభిస్తున్నాయి. ఫుట్‌పాత్‌పై వెలసిన అంగళ్ల నుంచి కిరాణా దుకాణాలు, రెస్టారెంట్లు, కూల్‌డ్రింక్ షాపులు, ప్రత్యేకంగా వెలసిన ఫ్రూట్‌జ్యూస్‌ల దుకాణాలల్లోనూ కూల్‌డ్రింక్స్ లభిస్తున్నాయి. రెడీమేడ్‌గా తయారు చేసిన ద్రవంతో అప్పటికప్పుడు కొన్ని రకాల కూల్‌డ్రింక్స్ తయారు చేసి ఇస్తుండగా, మరికొన్ని అప్పటికప్పుడు తయారు చేసి చేతికందిస్తున్నారు. ఇంకొన్ని ప్యాక్డ్ పద్ధతిలో టెట్రా ప్యాకెట్లు, సీసాల్లో విక్రయిస్తున్నారు. వీటితోపాటు కొన్ని చెరకు, బత్తాయి రసాలు, మజ్జిగ దుకాణాల్లో అపరిశుభ్రమైన నీటితో తయారైన ఐస్ ముక్కలను వాడుతున్నారు. ప్రతి దుకాణంలో రోజుకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వ్యాపారం సాగుతోంది. ఇలాంటి పానీయాలు ఆరోగ్యానికి హానికరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాటిలో వాడే కార్బన్ డై ఆక్సైడ్, ఫాస్పరస్ ఆమ్లాలు శరీరంలోకి చేరి కణాల్లోని ఆక్సిజన్ నిల్వలను తగ్గించి క్యాన్సర్‌కు దారి తీస్తాయని చెబుతున్నారు. దీంతో పాటు సోడియం బెంజోయేట్ అనే ప్రిజర్వేటివ్ రసాయనం కణాల్లోని డీఎన్ఏపై ప్రభావం చూపుతుంది. వాటిలోని అదనపు క్యాలరీలు ఊబకాయానికి దారి తీస్తాయి. పానీయంలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల రక్తపోటు పెరుగుతుంది. వాటిని అధికంగా సేవిస్తే దంతాలపై పొర దెబ్బతింటుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. దీర్ఘకాలంగా శీతలపానీయాలు తాగితే మెటబాలిక్ సిండ్రోమ్ అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

సహజపానీయం.. ఆరోగ్యకరం

రసాయనాలు, నిషేధిత రంగులు, అపరిశుభ్రమైన ఐస్ ముక్కలను కలిపిన కూల్‌డ్రింక్స్ తాగడం కంటే సహజసిద్ధమైన పానీయాలను తాగడం ఆరోగ్యకరమని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మనం ఇంట్లో తయారు చేసుకునే మజ్జిగ, లస్సి, నిమ్మరసం, తాజా పండ్ల జ్యూస్‌లు, కొబ్బరినీళ్లు, రాగిమాల్ట్, నన్నారి షర్బత్ మొదలైనవి శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడమే గాక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నారు. మనం ఎవరింటికి వెళ్లినా, మన ఇంటికి ఎవ్వరైనా వచ్చినా వీటినే వాడాలని సూచిస్తున్నారు.

నన్నారిలోనూ రసాయనాలు కలుపుతున్నారు



మార్కెట్‌లో లభించే నన్నారిలో కలర్ కోసం పలురకాల రంగులు, రసాయనాలు కలుపుతున్నట్లు ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు కొన్ని శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించాం. ప్రాథమికంగా పరిశీలిస్తే నన్నారి రంగు కూడా మారింది. ఇలాంటి నన్నారి తాగిన వారికి జీర్ణకోశ వ్యాధులు, అల్సర్లతో పాటు క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉంది. ప్రజారోగ్యం దృష్ట్యా ఇలాంటి కూల్‌డ్రింక్స్ దుకాణాలపై తరచూ దాడులు నిర్వహించి తనిఖీలు నిర్వహిస్తాం. రుచి, రంగు, చిక్కదనం కోసం రసాయనాలు, రంగులు కలిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– జి.రాజగోపాల్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, కర్నూలు

కూల్‌డ్రింక్స్ కన్నా సాంప్రదాయ రసాలే మేలు



చాలా మంది వేసవి వచ్చిందంటే కూల్‌డ్రింక్స్ తాగేందుకే మక్కువ చూపుతారు. వాస్తవంగా అందులో పొటాషియం ఉన్న ఉప్పు ఉంటుంది. ఇది శరీరానికి హాని చేస్తుంది. దానికి బదులు మజ్జిగ, నిమ్మకాయ సోడాలో ఉప్పు వేసుకుని తాగాలి. మనం వేసుకుని తాగే ఉప్పులో సోడియం ఉంటుంది. దీంతో పాటు కూరల్లోనూ ఉప్పును వాడాలి. ప్రతిఒక్కరూ రోజుకు నాలుగు లీటర్ల మంచినీటిని తాగాలి. ఎండవేడిమి కారణంగా మూత్రం పచ్చగా వస్తుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. మాంసాహారం మితంగా తీసుకోవాలి. నిమ్మజాతి పండ్లను బాగా తినాలి. – డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి, యురాలజిస్టు, కర్నూలు

బాలికల సదనానికి ఇద్దరు బాలికలు



మహాలక్ష్మి



అనిత

కర్నూలు(అర్బన్): పెద్దపాడు దామోదరం సంజీవయ్య బాల సదనంలో గత కొంతకాలంగా వసతి పొందుతున్న ఇద్దరు బాలికలను సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు కర్నూలులోని బాలికల సదనం సంరక్షణలో ఉంచుతున్నట్లు జిల్లా మహిళా, శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి పి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదనంలో ఉంచిన బీ.మహాలక్ష్మి (14), ఎస్.అనిత (10)ను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు లేదా కుటుంబసభ్యులు తగిన ఆధారాలతో 30 రోజుల్లోగా తమను సంప్రదించాలన్నారు. లేని పక్షంలో వారిని అనాథలుగా పరిగణించి సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ నిబంధనల మేరకు దత్తత ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు.

వైద్యులకు పదోన్నతులు

కర్నూలు (హాస్పిటల్): మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న పలువురు అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు లభించాయి. ఇందులో భాగంగా కర్నూలు మెడికల్ కళాశాలలో రేడియేషన్ ఆంకాలజీలో పనిచేస్తున్న డాక్టర్ యు.ఉమామహేశ్వర రెడ్డిని కడపకు పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాలలో ఆర్థోపెడిక్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ డి.రాజయ్యను కర్నూలు మెడికల్ కళాశాలకు, స్విమ్స్‌లో అనస్థీషియా విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్.శ్రీనివాసరావును కర్నూలు మెడికల్ కళాశాలకు పోస్టింగ్ ఇచ్చారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: నగరంలో 15 ఆటోలతో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగంపై అవగాహన బ్యానర్లతో అనౌన్స్‌మెంట్ ర్యాలీ నిర్వహించేందుకు యూనియన్ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. స్థానిక కొండారెడ్డిబురుజు వద్ద సోమవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆటో అనౌన్స్‌మెంట్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రద్దీ ప్రాంతాల్లో హెల్మెట్ వినియోగం, సైబర్ నేరాల బారిన పడకుండా పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌తో ఆటోలో తిరుగుతూ పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తారు. సామాజిక బాధ్యత గల దాతల సహకారంతో రద్దీ ప్రాంతాలైన బళ్లారి చౌరస్తా, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో నాలుగు అధునాతన డిజిటల్ బ్యానర్లను ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధారణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే ట్రాఫిక్ నిబంధనల గురించి ఈ డిజిటల్ బ్యానర్ల ద్వారా అవగాహన కల్పించనున్నారు. అలాగే రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్లు, 125 మూవబుల్ బారికేడ్స్ దాతలు ప్రేమ్‌రెడ్డి సత్యనారాయణ(సీఎంఆర్), నాగమునేశ్వరరావు, శశిధర్‌రెడ్డి (చందన బ్రదర్స్), సాంబశివారెడ్డి (నాగార్జున సిమెంట్ సీనియర్ మేనేజర్), కోటిరెడ్డి (శ్రీశైలం ఆర్ఎంసీ)లను ఈ సందర్భంగా ఎస్పీ సత్కరించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు బాబుప్రసాద్, భాస్కర్‌రావు, సీఐలు పాల్గొన్నారు.

అరబిక్ హైస్కూల్‌ను కార్పొరేట్‌కు అప్పగించొద్దు

కర్నూలు సిటీ: ఉస్మానియా కాలేజీ ఆవరణలో ఉన్న 100 ఏళ్ల ఉమర్ అరబిక్ హైస్కూల్‌ను కార్పొరేట్ కాలేజీకి అప్పగించరాదని ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సలీం అలీఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆ హైస్కూల్ వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. వందేళ్ల చరిత్ర కలిగిన అరబిక్ హైస్కూల్‌ను అంజుమన్ కమిటీ సభ్యులు ఓ కార్పొరేట్ విద్యాసంస్థకు అప్పగించనున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఈ విషయమై వాస్తవాలను తెలుసుకునేందుకు స్కూల్‌కు వచ్చామని, ఎవరూ లేకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. కమిటీ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేకపోతే పూర్వ విద్యార్థులతో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం స్కూల్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాలు రాణించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, అధికారులు

కర్నూలు(సెంట్రల్): ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం సునయన ఆడిటోరియంలో ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం-నవ సార్వత్రిక సూత్రాలు-ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు అనే పేరుతో ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు భాగస్వామ్యం కావడం అనివార్యమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో నిర్దేశించిన నవ సూత్రాలను పాటించాలని, మెరుగైన వ్యవసాయ పద్ధతులు, కాషాయాల ద్వారా చీడపీడల నివారణపై అవగాహన పెంచుకోవాలన్నారు. రసాయనాల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, పీఎల్ఎంపీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

పీ–4 సర్వేతో పేదరికం లేని సమాజం

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ–4 సర్వే పూర్తయితే పేదరికం లేని సమాజం ఆవిష్కృతమవుతుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆటిటోరియంలో ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యం (పీ4) తో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి అనే వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంట్‌లోని 10 సూత్రాల్లో మొదటి సూత్రమైన శూన్య పేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్ (పీ–4) పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, సీపీఓ హిమ ప్రభాకరరాజు తదితరులు పాల్గొన్నారు.


'యువత పోరు'ను విజయవంతం చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో చేపడుతున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని చేద్దామని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కాటసాని తన స్వగృహంలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలన్నారు. ఐదు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలాల వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడలు వంచుదాం



తెర్నెకల్ సురేందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

కర్నూలు (టౌన్): విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12 న చేపట్టనున్న యువత పోరుకు విద్యార్థులు, నిరుద్యోగులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తేర్నెకల్ సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. తద్వారా కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలుగచేద్దామన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక సీతారామనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రూ.1.30 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపి ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనంగా మార్చి తొలి ఏడాది ఎగనామం పెట్టిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఎక్కడని ప్రశ్నించారు. ఓట్ల కోసం అలివికానీ హామీలు ఇచ్చి అన్ని వర్గాలను దగా చేశారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జగనన్న హయంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుడితే వాటిని ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని తద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే అవకాశం లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ ఏమైందని నిలదీశారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేసేందుకు బాధ్యత తీసుకోవాలన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ, ప్రజా సంఘాల నేతలు

కర్నూలు(అర్బన్): చదువుల తల్లి సావిత్రీబాయి మహిళలందరికీ ఆదర్శమని పలువురు బీసీ నేతలు అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, తదితరులు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడిత ప్రజల పక్షాన ఆమె చేసిన పోరాటాన్ని కొనియాడారు.

అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



నివాళులర్పిస్తున్న ఏపీ మహిళా సమాఖ్య నాయకులు

కర్నూలు(సెంట్రల్): సావిత్రిబాయి పూలే పోరాట స్ఫూర్తితో అణచివేత, అసమానతలపై ఉద్యమిద్దామని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, నగర కార్యదర్శి భారతి పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి ఏపీ మహిళాసమాఖ్య సంఘం నాయకులు నివాళులర్పించారు. నాయకురాళ్లు నాగేంద్రమ్మ, వెంకటేశ్వరమ్మ, సులోచనమ్మ, ఆదిలక్ష్మీ, చంద్రకళ, శ్రీదేవి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కర్నూలు జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం కోడుమూరు పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుండ్రేవుల, వేదావతి, ఆర్డీఎస్, హంద్రీనీవా, గురురాఘవేంద్ర ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు, స్థానిక నాయకులు మధు, భీముని స్వామి, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు రంగస్వామి, చిన్న, ఖాజా, దస్తగిరి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

బీవీ..తీరు మార్చుకో?

కర్నూలు(సెంట్రల్): బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎమ్మిగనూరు ఎమ్మెల్యేనా లేదంటే కురువ కుల నాయకుడా అని జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ ప్రశ్నించారు. ఇటీవల అసెంబ్లీలో మాదిరి/మదాసి కరువులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి డిమాండ్ చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే మాటలను తప్పు పడుతూ జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనచేపట్టారు. నాయకులు సోమన్న, ప్రశాంత్‌కుమార్, రత్నం పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీని అరికట్టండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కర్నూలు (టౌన్): గొలిగేరిలో తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. దీనివల్ల తాగునీటి సమస్య వస్తోంది. తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు నాగయ్య ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్ఓ జునీద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే...

- బాబా బృందావన్ నగర్‌లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందిగా ఉందని స్థానికులు సుబ్బయ్య విన్నవించారు. అలాగే రాజీవ్‌నగర్‌లోను ఇదే సమస్యపై వినతిపత్రం అందజేశారు.
- స్టాంటన్‌పురంలోని హ్యాపీ హోమ్స్ వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు విష్ణువర్ధన్ రెడ్డి అభ్యర్థించారు.
- నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ నుంచి జొహరాపురం కేసీ కెనాల్ వెళ్లే 100 అడుగుల రహదారిని కొందరు అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, సర్వే చేసి వాటిని కాపాడాలని మహేష్, పవన్ విన్నవించారు.

కారు బోల్తా - దంపతులకు గాయాలు



బోల్తా పడిన కారు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారున 44వ జాతీయ రహదారిపై సోమవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. కర్నూలులోని పార్క్ రోడ్డులో ఉన్న అలంకార్ ప్లాజాలో నివాసముంటున్న మోహన్ గురుసాయి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్య మౌనికతో కలిసి కర్నూలుకు వచ్చిన ఆయన సోమవారం ఉదయం కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. కొత్తపేట గ్రామ శివారులోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన స్తంభానికి ఢీకొని ఆగిపోయింది. ఘటనలో మోహన్ గురుసాయి, మౌనిక దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.